

చాముండేశ్వరీదేవి ప్రత్యేక దర్శన **టిక్కెట్ రూ.2వేలు**

తొక్కిసలాట నియంత్రణకు **కొత్తచట్టం** 7
త్వరలో అమలుకు సర్కారు కసరత్తు

ముంచెత్తిన వాన


అపార్ట్‌మెంట్ల మధ్య నీరు..


జలమయమైన మంగళూరులోని ఓ వీధి

● రాష్ట్రంలో జోరుగా వర్షాలు ● ఐదు జిల్లాల్లో రెడ్ అలర్ట్ ● బంట్వాళలో అత్యధిక వర్షం

బెంగళూరు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు జోరందుకున్నాయి. బెంగళూరులో ఆదివారం ఉదయం నుంచే మేఘావృతమైంది. సాయంత్రం నగరమంతటా వర్షం కురిసింది. దక్షిణకన్నడ జిల్లాకేంద్రం మంగళూరులో శనివారం మధ్యాహ్నం ప్రారంభమైన వాన నిరంతరంగా కురుస్తోంది. నగరంలో రోడ్లు నదులను తలపించాయి. భైందూరు, కొట్టార, పంప్‌వెల్ ఫ్లైఓవర్, కార్‌స్ట్రీట్ ప్రదేశాలలోని లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ప్రవాహంలో చిక్కుకున్న బస్సులోకి కిటికీలదాకా నీరు చేరింది. పడిల్ రైల్వేస్టేషన్ అండర్‌పాస్‌లో నీరు నిండిపోవడంతో సంచారానికి అంతరాయం ఏర్పడింది. తీరప్రాంత జిల్లాలు దక్షిణకన్నడ, ఉడుపి, ఉత్తరకన్నడ శివమొగ్గ, కొడగు జిల్లాల్లో రెడ్ అలర్ట్ ప్రకటించారు. ఉడుపి జిల్లాలో భారీ వర్షం ధాటికి చౌర్లా-గోవా రహదారి కొట్టుకుపోవడంతో వాహన సంచారం లేకుండాపోయింది. బెళగావి జిల్లా ఖానాపుర తాలూకా కుసమళి గ్రామం వద్ద ప్రమాదం జరిగింది. బెళగావి జిల్లా వ్యాప్తంగా భారీ వర్షం కురుస్తుండడంతో జంబోటి, కనకుంబితోపాటు పలు గ్రామాలు నీట మునిగాయి. రానున్న 48 గంటలు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, వాతావరణ పరిశోధన శాఖ ప్రకటించింది. సోమవారం దాకా బెళగావి, ధారవాడ, మైసూరు, హాసన్, దావణగెరె, గదగ్ తదితర జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రకటించారు. బెంగళూరులో భారీ వర్షం లేకున్నా నిరంతరం కురిసే అవకాశం ఉందని ప్రకటించారు. కనీసం 50కిలోమీటర్ల వేగంతో గాలి వీచే అవకాశం ఉందన్నారు.


◄ రబ్బర్ బోట్లలో బాధితులను తరలిస్తూ..


కూలిన ఇంటి గోడ ←

జల మయమైన రహదారి →



కృష్ణా నదికి వరద..

రాయచూరు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): నది ఎగువ భాగంలోనే నారాయణపూర్ జలాశయం నుంచి 29,226 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్న నేపథ్యంలో ఆదివారం జిల్లా సరిహద్దులో కృష్ణానది ప్రవాహం పెరిగింది. నారాయణపూర్ జలాశయానికి ఇప్పటికే 31000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 7 గేట్‌ల ద్వార 29,226 క్యూసెక్కుల నీటిని అధికారులు దిగువకు విడుదల చేస్తున్నారు. బసవసాగర్ జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టం 492.25 మీటర్‌లకు గాను ఇప్పటికే 491.25 మీటర్‌లకు చేరింది. రిజర్వర్ సామర్థ్యం 33.313 టీఎంసీలు కాగా ఇప్పటికే జలాశయంలో 28.45 టీఎంసీల నీరు చేరినట్లు అధికారులు తెలిపారు.


నారాయణపూర్ జలాశయం నుంచి దిగువకు వస్తున్న నీరు

దక్షిన కన్నడలో దంచేసింది..

దక్షిణకన్నడ జిల్లా వ్యాప్తంగా 24 గంటల్లో భారీ వర్షం కురిసింది. పుదువిలో 18.95 సెంటిమీటర్లు, మంగళూరు తాలూకా నీరుమార్గాలో 18.5 సెంమీ, బంట్వాళ తాలూకా నేరమజలు 17.4 సెంమీ కురిసింది. జిల్లావ్యాప్తంగా సగటున 14 -15 సెంటిమీటర్ల వర్షం నమోదైంది. నగరంలోని శివభాగ్ ప్రాంతం సుందరి అపార్ట్‌మెంట్ వెనుక గోడ కూలడంతో అక్కడ నివసించే కుటుంబాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించారు. జిల్లా వ్యాప్తంగా పంటనష్టం వాటిల్లింది. జాతీయ రహదారి కత్తికల్‌లో గోడ కూలడంతో ఒకేవైపునుంచి వాహనాల రాకపోకలు ఏర్పాటు చేశారు. కావేరి నదికి అనుబంధమైన కబిని, హారంగి, కేఆర్ఎస్, హేమావతి జలాశయాలకు ఇన్‌ఫ్లో భారీగా పెరిగింది. తలకావేరిలో గరిష్టంగా 200 మిమీ వర్షం కురిసింది. భాగమండలలో 130మిమీ, శాంతల్లిలో 75మిమీ కురిసింది. కేఆర్ఎస్‌లో 30.845 టీఎంసీల నీటిమట్టానికి చేరింది. ఇన్‌ఫ్లో 3,377 క్యూసెక్కులు కాగా అవుట్‌లో 906 క్యూసెక్కులుగా ఉంది. హేమావతిలో 24.911 టీఎంసీల నీరు ఉండగా, ఇన్‌ఫ్లో 1907 క్యూసెక్కులు కాగా అవుట్‌ఫ్లో 350 క్యూసెక్కులుగా ఉంది. కబిని సామర్థ్యం 19.52 టీఎంసీలు కాగా 15 టీఎంసీలకు చేరింది. హారంగి డ్యాం సామర్థ్యం 8.5 టీఎంసీలు కాగా 6.30 టీఎంసీలకు చేరింది. కొడగు జిల్లాలో భారీ వర్షం కురుస్తుండడంతో హారంగి జలాశయం ఎప్పుడైనా నిండవచ్చునని అధికారులు అంచనా వేశారు. అందుకే 4వేల క్యూసెక్కులదాకా నీటిని విడుదల చేస్తున్నారు. దాదాపు రాష్ట్రంలోని ప్రధాన జలాశయాలన్నీ నిండిపోనున్నాయి. రెండు, మూడు రోజుల్లో కాల్వలకు నీరు వదిలే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.



కార్యక్రమంలో జేడీఎస్ అధ్యక్షుడు దేవెగౌడ, కుమారస్వామి, నిఖిల్

రాష్ట్రంలో జేడీఎస్-బీజేపీ మైత్రి సర్కారు

● కేంద్రమంత్రి కుమారస్వామి జోస్యం
● జేడీఎస్ సభ్యత్వ నమోదు ప్రారంభం

బెంగళూరు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జేడీఎస్-బీజేపీ మైత్రి ప్రభుత్వం ఏర్పాటు ఖాయమని కేంద్ర మంత్రి కుమారస్వామి జోస్యం చెప్పారు. ఆదివారం జేడీఎస్ కార్యాలయం జేపీ భవన్‌లో సభ్యత్వ నమోదుకు శ్రీకార చుట్టారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు దేవేగౌడ, జేడీఎస్ యువ విభాగం అధ్యక్షుడు నిఖిల్ కుమారస్వామితోపాటు పార్టీ ముఖ్యనాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ బీజేపీతో మైత్రి విషయంలో ఎటువంటి గందరగోళం లేదని, సీట్లు తీసుకొచ్చే బాధ్యత తనదేనని, కార్యకర్తలు నియోజకవర్గాలలో శక్తివంతం కావాలన్నారు. అన్నీ కేంద్రంలోనే నిర్ధారణ అవుతాయన్నారు. కాంగ్రెస్‌ను సంపూర్ణంగా ఓడించి ఇంటికిపంపే వరకు విశ్రమించేది లేదని సవాల్ చేశారు. జేడీఎస్‌ను కుటుంబ పార్టీ అంటారని, కానీ తన వద్దకు వచ్చేవారు శ్రీమంతులు లేరని, పేదవారు మాత్రమే అన్నారు. సిద్ధరామయ్య, డీకే శివకుమార్ ఇళ్లవద్దకు ఎటవంటివారు వస్తారని ప్రశ్నించారు. తాను కేంద్రంలో పరిశ్రమలశాఖ మంత్రి అని, అంతమాత్రాన జేపీనగర్‌కు సూట్‌లు వేసుకుని ఎవ్వరూ రావడం లేదన్నారు. ఉద్యోగం, అనారోగ్యం వంటి కష్టాలు చెప్పుకొనేవారు అధికంగా వస్తారన్నారు. ఇటువంటి వారు డీసీఎం ఇంటికి ఎందుకు వెళ్లరన్నారు. అధికారం ఉన్నా, లేకున్నా 7 కోట్లమంది కష్టాలలో జేడీఎస్ ఉంటుందన్నారు. రాష్ట్రంలో మామిడి రైతుల సమస్య పరిష్కరించాలని, కేంద్ర వ్యవసాయశాఖ మంత్రికి సీఎం లేఖ రాశారన్నారు. 2006లో తాను సీఎంగా ఉన్నప్పుడు ఢిల్లీలో టమోటా రైతుల సమస్యను పరిష్కరించానన్నారు. ఇది కాంగ్రెస్, జేడీఎస్‌కు మధ్య ఉన్న ప్రధాన వ్యత్యాసమన్నారు. 40ఏళ్లపాటు ఎమ్మెల్యేగా 20ఏళ్లపాటు మంత్రిగా కొనసాగిన మల్లికార్జున ఖర్గే కల్యాణ కర్ణాటకకు ఏం సాధించారన్నారు. ఇంతకూ ఆయన సొంత నియోజకవర్గం గురుమిట్కల్‌ను అభివృద్ధి చేశారా..? అని ప్రశ్నించారు.

బెంగళూరును సింగపూర్ చేస్తామని గొప్పలు చెబుతారని, ఒకరోజు వర్షానికే సాయి లే అవుట్ ఏమైందో... రాష్ట్రంలో అందరికీ తెలుసునన్నారు. తాను ఆరోగ్యంగా ఉన్నానని, మరో 15-20ఏళ్లు ప్రజల మధ్యనే ఉంటానన్నారు. కుమారస్వామి ఆరోగ్యం చెడిందని కొందరు అంటారని, అటువంటి ఆలోచన వద్దన్నారు. ప్రజలపై పన్నుల భారం మోపి, గ్యారెంటీలు పంచేటట్టుగా ఉంటే రూ.5వేలు ఇచ్చేవాడినన్నారు. కులగణన నివేదిక అధికారికం కాదని కార్యదర్శి సంతకమే లేదన్నారు. ఇప్పుడు మళ్లీ సర్వే అంటూ 90 రోజుల్లో ముగిస్తానని చెబుతున్నారన్నారు. కులాల ఆధారంతో రాష్ట్రాన్ని నిర్మించలేమని, అన్ని కులాల్లోనూ పేదలు ఉన్నారన్నారు. బీజేపీతో అణిగిమణిగా ఉందామని, తప్పులు చేయవద్దని కార్యకర్తలకు సూచించారు. రాష్ట్రమంతటా నిఖిల్ పర్యటిస్తారన్నారు.



తుంగభద్ర నీటి మట్టం :1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1603.82	1,582.89
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	8,776	1,676
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	178	301
నీటి నిల్వ (టీఎంసీలు)	26.87	6.02

గిడ్డంగులకు చేరిన మొక్కజొన్న



గోడౌన్ వద్ద మొక్కజొన్న లారీ

కంప్లి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చిక్క జాగనూరు రోడ్డు సమీపంలోని కర్ణాటక రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ గోడౌన్‌లో 7250 మెట్రిక్ టన్నుల మొక్కజొన్న నిల్వ చేసినట్లు సెంట్రల్ గిడ్డంగుల విజిలెన్స్ అధికారి శివకుమార్ తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ మొక్కజొన్న నాణ్యతను కాపాడుకోవడానికి పాలిథిన్ షీట్లను ఉపయోగించడం కానీ పురుగులమందులను పిచికారీ చేయడం వంటి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన సిబ్బందిని ఆదేశించారు. ఇక్కడున్న వేర్ హౌసింగ్ కార్పొరేషన్ గిడ్డంగులు 28 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగి ఉన్నాయి. ఇది లక్ష టన్నుల నిల్వ సామర్థ్యాన్ని కలిగి వుంది. ఇప్పటికే కంప్లి, సిరుగుప్ప, కరూరు, బళ్లారి, హచ్చొళ్లి, సింధనూరు నుండి జొన్నలను సేకరించింది. వివిధ జిల్లాల నుండి జొన్నలు, కందులు, ఇతర ధాన్యాలు ఈ గోడౌన్‌కు నిల్వ చేస్తున్నారని తెలిపారు. వచ్చే నెల నుండి రేషన్‌కార్డుదారులకు పంపిణీ చేయడానికి ఈ జొన్నలను ఉపయోగిస్తామని ఆయన అన్నారు. వారితోపాటు గిడ్డంగి మేనేజర్ అంబరీష్, గంగన్న, శ్వేత, జాదవ్, సోమశేఖర్ పాల్గొన్నారు.

ముందుకు సాగాల్సిందే..



గడిగేరి తండాలో సాగుపనుల్లో దంపతులు

కంప్లి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో సాగుపనులు జోరందుకున్నాయి. ఒక్కసారిగా పంటలు చిగురించడంతో ఎద్దులకు, ట్రాక్టర్లకు డిమాండ్ పెరిగిపోయింది. సమయానికి ఎద్దులు దొరకకపోవడంతో గెడగేరి తండాలో దంపతులు పరిశప్ప, జుమ్మవ్వ సేద్యం పనులకు దిగారు. ఈ సందర్భంగా పరశప్ప మాట్లాడుతూ ఎద్దులు దొరకడం లేదని, ట్రాక్టర్లకు సొమ్ము అధికంగా చెల్లించలేక స్వయంగా సాగుకు దిగామన్నారు. సండూరు సమీపంలోని విట్లాపురం గ్రామంలో కూడా పొలంలో విత్తనం వేయడానికి ఎద్దులు దొరకకపోవడంతో అక్కాచెల్లెలు గంగమ్మ శారద విత్తనం వేయడానికి సిద్ధమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎకరానికి విత్తనానికి రూ. రెండు వేల నుంచి రూ. మూడు వేలు వరకు డిమాండ్ పలుకుతుందని, ఎద్దులకు సొమ్ము చెల్లించలేక తామే సేద్యానికి దిగామన్నారు.



విట్లాపురంలో అక్కాచెల్లెలు



తుప్పు పట్టిపోతున్న ఇనుప కడ్డీలు



పునాదులకే పరిమితమైన పనులు

నిర్మాణాలకు గ్రహణం..!

- ఆగిపోయిన పోలీసు క్వార్టర్స్ పనులు
- ప్రొటోకాల్ నెపంతోనే నిలిపివేత..
- తుప్పుపట్టిపోతున్న నిర్మాణ సామగ్రి

బళ్లారి గాంధీనగర్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతలు కాపాడడంలో ప్రధాన పాత్ర పోషిస్తున్న పోలీసు శాఖ సంక్షేమానికి చేపట్టిన క్వార్టర్స్ నిర్మాణానికి గ్రహణం పట్టింది. ప్రోటోకాల్ కారణంగా ఎనిమిది నెలలుగా నిర్మాణ పనులు ఆగిపోయాయి. దీంతో పనులు చేపట్టిన కాంట్రాక్టర్ లబోదిబోమంటున్నాడు. ఓ వైపు జిల్లా పోలీసు ఉన్నతాధికారుల నుంచి పనులు ముగించాలని ఒత్తిళ్ళు వస్తుండగా... మరోవైపు స్థానిక ప్రజా ప్రతినిధులకు సమాచారం ఇవ్వకుండా పనులు ఎలా ప్రారంభిస్తారనే హెచ్చరికలు వస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో ఆ కాంట్రాక్టర్ పరిస్థితి ముందు నుయ్యి..వెనక గొయ్యి చందాన తయారయ్యింది. క్వార్టర్స్ నిర్మాణం కోసం తీసుకొచ్చిన ఇనుప కడ్డీలు, కాంక్రీటు పిల్లర్ల కోసం నిర్మించిన స్ట్రక్చర్స్. వర్షంలో తడిసి తుప్పుపట్టి పనికి రాకుండా పోతున్నాయి. లక్షలు రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన టన్నులకొద్ది ఇనుప కడ్డీలు నిరుపయోగంగా మారుతున్నాయి. ఈ పనులకు సంబంధించి గత ఏడాది 2024, నవంబరు నెలలో కర్నాటక పోలీసు వెల్ఫేర్ హౌసింగ్ కార్పొరేషన్ వారు బళ్ళారి, విజయనగర ఉభయ జిల్లాల పరిధిలో హొసపేట, కూడ్లిగి, బళ్ళారి, సిరుగుప్ప తాలూకా కేంద్రాల్లో కొత్తగా జీ+2 విధానంలో పోలీసుల కోసం క్వార్టర్స్ నిర్మాణం పనులను శ్రీకారం చుట్టారు. ఈ నేపథ్యంలోనే బళ్ళారి నగరంలో రూ.8కోట్లు వెచ్చించి జీ+2 విధానంలో మూడు టవర్ల నిర్మాణాల్లో 36 ఇళ్ళు నిర్మించేందులా బెంగళూరుకు చెందిన పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ నుంచి సురేష్ బిల్డ్ వర్క్ అనే సంస్థ పనులు దక్కించుకుంది. గత ఏడాది నవంబరు 6వ తేదీన ఐజీ లోకేష్, ఎస్పీ శోభారాణి పనులకు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. స్థానిక నేతల ఒత్తిడితో పనులు ఆగపోయినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం నగరంలో డీఆర్ గ్రౌండ్, సత్యనారాయణ పేట, రేడియో పార్కులు, ప్రాంతాల్లో ఉన్న క్వార్టర్స్ శిథిలావస్థకు చేరుకోవడంతో నూతన క్వార్టర్స్ నిర్మాణానికి పూనుకున్నారు. గత ఏడాది బళ్ళారి నగరంతో పాటు సిరుగుప్ప, హొసపేట, కూడ్లిగి తాలూకా కేంద్రాల్లో ప్రారంభమైన పోలీసు క్వార్టర్సు నిర్మాణం పనులు దాదాపు ముగింపు దశకు చేరుకున్నాయి. అయితే బళ్లారి నగరంలో మాత్రం పనులకు బ్రేక్ పడింది. శిథిలమైన ఇళ్ళలో బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్ళదీస్తున్న పోలీసులు కొత్త వాటి కోసం ఎదురు చూస్తున్నారు. ప్రజల సేవలో 24గంటల పాటు శ్రమిస్తున్న పోలీసు శాఖకు సహకరించాల్సిన నేతలే క్వార్టర్స్ నిర్మాణాలకు మోకాలడ్డుకోవడం ఏమిటని...? పోలీసు వర్గాల్లో పూర్తి చర్చనీయాంశంగా మారింది. సాధారణంగా నగరంలో వివిధ శాఖల ఆధ్వర్యంలో జరిగే అన్ని అభివృద్ధి పనులకు సంబంధించి స్థానిక ప్రజా ప్రతినిధులకు సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. వారి చేతులు మీదుగానే భూమి పూజ చేసి పనులు ప్రారంభించడం ఆనవాయితీ. అయితే ఆ సమయంలో సండూరు శాసనసభ నియోజకవర్గం ఉప ఎన్నికలు నేపథ్యంలో ఎన్నిక కోడ్ అమల్లో ఉన్న కారణంగా ప్రజా ప్రతినిధులకు సమాచారం అందలేదని తెలుస్తోంది. పనులు సజావుగా సాగుతున్న తరుణంలో... ఒక్కసారిగా పనులు ఆపేయాలంటూ... స్థానిక నాయకుల నుంచి ఆదేశాలు అందినట్లు తెలుస్తోంది. బళ్ళారి జిల్లా పోలీసు వెల్ఫేర్ విభాగం దావణగెర డివిజన్ పరిధిలోకి వస్తున్న కారణంగా ఆగిపోయిన పనులకు సంబంధించి ఆంధ్రజ్యోతి వివరణ కోరగా... స్థానిక ప్రజా ప్రతినిధుల నుంచి సహకారం అందడం లేదని, కాంట్రాక్టర్ తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా ఇబ్రహీంపురం పాఠశాల అమృతోత్సవం

- 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సంబరాలు
- 28 ఏళ్లు సేవలందించిన యర్రిస్వామికి ఘన సత్కారం



ప్రధానోపాధ్యాయుడు యర్రిస్వామి దంపతులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు



ఇబ్రహీంపురం పాఠశాల

బళ్లారిరూరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : ఇబ్రహీంపురం గ్రామంలో పాఠశాల ప్రారంభమై 75 సంవత్సరాలు కావడంతో గ్రామ ప్రముఖులు, పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సంబరాలు నిర్వహించారు. 1950లో స్కూలు ప్రారంభం అయ్యింది. ఎందరో ప్రముఖులు ఈ పాఠశాలలో చదువుకున్నట్లు గ్రామస్థులు తెలిపారు. ఈ కార్యక్రమం సందర్భంగా ఈ స్కూలులో విధులు నిర్వహించే శంకరబండ గ్రామానికి చెందిన ఉపాధ్యాయులు యర్రిస్వామి దంపతులను ఘనంగా సత్కరించారు. యర్రిస్వామి ఇదే పాఠశాలలో 28 సంవత్సరాలు పని చేయడం విశేషం. గతంలో పాఠశాలలో రెండు గదులు మాత్రమే ఉండేవి. యర్రిస్వామి రిటైర్మెంట్ సమయానికి 13 గదుల నిర్మాణానికి కృషి చేశారు. పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు ఆయన్ని ఘనంగా సత్కరించారు.

సదుపాయాలులేని రుద్రపాద పాఠశాల



సదుపాయాలు లేని పాఠశాల భవనం

బళ్లారి సిటీ,జూన్ 15(ఆంధ్రజ్యోతి): సిరుగుప్ప తాలూకా తెక్కలకోట రుద్రపాద గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత ప్రాథమిక పాఠశాలలో మౌలిక సదుపాయాలు కరువయ్యాయి. ఆటస్థలం, మరుగుదొడ్డి, కాంపౌండ్, వంటగది, శుభ్రమైన నీటి యూనిట్ వంటి మౌలిక సదుపాయాలు లేకపోవడంతో విద్యార్థుల చదువుకు ఆటంకం తప్పడం లేదని పాఠశాల ప్రాధానోపాధ్యాయుడు బసవరాజు, ప్రభాకర్ తెలిపారు. పాఠశాలలో 1నుంచి 7వరకు తరగతులు ఉన్నాయి. మొత్తం 119మంది విద్యార్థులున్నారు. ఇద్దరు శాశ్వత, ఇద్దరు అతిథి ఉపాధ్యాయులు సహా మొత్తం నలుగురు పని చేస్తున్నారు. 7 తరగతులకు 5 గదులు ఉన్నాయి. శిథిలావస్థలో ఉన్నగదిని వంట కోసం ఉపయోగిసున్నారు. మిగిలిన నాలుగు గదుల్లో పాఠాలు, ఉపన్యాసాలు నిర్వహించడం అవసరం అని ఉపాధ్యాయులు అంటున్నారు. పాఠశాలలో రెండు మరుగుదొడ్లు ఉన్నాయి. ఉపాధ్యాయులతో సహా బాలురు, బాలికలు ఇద్దరూవాటిని ఉపయోగించాలి. మరిన్ని సౌకర్యాలు కల్పిస్తే విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుందని ఉపాధ్యాయులు అంటున్నారు.



ఆహ్లాదం..!

బళ్లారిరూరల్, జూన్15(ఆంధ్రజ్యోతి): బళ్లారిరూరల్ తాలుకాలోని పీడీహళ్లి అగ్రి వద్ద ఆదివారం సూర్యాస్తమయం విశేషంగా ఆకట్టుకుంది. ఓ వైపు నల్లటి మబ్బులు కమ్ముకుని ఉండగా, మరోవైపు ఎర్రటి మేఘాల్లో సూర్యుడు దర్శనమిచ్చాడు. పచ్చని పొలాలు, వేదవతి ప్రవాహం స్థానికులకు ఆహ్లాదం కలిగించింది.



అంగన్‌వాడీ కేంద్రం

ప్రారంభానికి నోచుకోని అంగన్‌వాడీ కేంద్రం

- పనులు పూర్తయి మూడేళ్లు.. శిథిలమవుతున్న భవనం

బళ్లారి సిటీ,జూన్ 15(ఆంధ్రజ్యోతి): సండూరు తాలూకాలోని తోరణగల్లు గ్రామ పంచాయతీ ఆవరణలో ఉన్న 5వ అంగన్‌వాడీ కేంద్రం నూతన భవనం దాదాపు మూడు సంవత్సరాలుగా ప్రారంభోత్సవానికి నోచుకోకుండా శిథిలావస్థలో పడి ఉంది. నిర్మాణంలో పని తీరు నాసిరకంగా ఉండటం, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడంతోనే ఈ దుస్థితి ఏర్పడిందని స్థానికులు వాపోతున్నారు. బళ్లారి జిల్లా పంచాయతీ గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్‌శాఖ ఆధ్వర్యంలో శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ రూర్బన్ పథకం కింద రూ.18లక్షల వ్యయంతో ఈ కేంద్రాన్ని నిర్మించారు. అయితే ప్రారంభోత్సవానికి ముందే భవనం పైకప్పు ముందు గోడలు పగుళ్ళు ఏర్పడ్డాయి. పిల్లలకు తాగునీటి కోసం గ్రౌండ్ లెవల్ ట్యాంక్ నిర్మించలేదు. తక్కువ లెవల్ టాయెలెట్లు నిర్మించలేదు. చిన్న పిల్లల కోసం భవనం ముందు కనీసం ఇనుప గ్రిల్స్ కూడా ఏర్పాటు చేయలేదు. భవనం లోపల టైల్స్ సరిగ్గా అమర్చలేదు. విద్యుత్ వైరింగ్ బోర్డులు కాలిపోయాయి. పిల్లల కోసం కొత్త బొమ్మలు ఉన్నప్పటికీ కేంద్రంలో స్థలం లేకపోవడం వల్ల అవి వృథా అవుతున్నాయని ప్రజలు ఆరోపించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని కొత్తభవనంలోకి మార్చడానికి శాఖ అధికారులు త్వరగా చర్యలు తీసకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

'నీట్'లో సత్తా చాటిన బెస్ట్ విద్యార్థులు





మహ్మద్ అష్పాక్ అఫీపా అంజుమ్ దీరజ్

బళ్లారి సిటీ, జూన్ 15(ఆంధ్రజ్యోతి): నీట్ ఫలితాల్లో బెస్ట్ కాలేజీ విద్యార్థులు సత్తా చాటారు. సయ్యద్ మహ్మద్ అష్పాక్ నీట్ 2025లో 550మార్కులు సాధించారు. కే.ధీరజ్ 453మార్కులు, అఫీఫా అంజుమ్ 445, 400కంటే ఎక్కువ మార్కులు సాధించిన 10మంది విద్యార్థులు అద్భుతమైన మార్కులు సాధించి కళాశాల ఖ్యాతిని పెంచారని కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు తెలిపారు. ఉత్తమ ర్యాంక్ సాధించిన విద్యార్థులను బెస్ట్‌కాలేజీ అధ్యక్షుడు కోనంకి రామప్ప, ఉపాధ్యక్షుడు కోనంకి తిలక్‌కుమార్, కార్యదర్శులు మన్నెం శ్రీనివాసులు, రామరాయుడు, కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు, వైస్.ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రెడ్డి, సిబ్బంది వర్గం అభినందించారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమిపూజ



భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే గణేష్

కంప్లి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): రోడ్లు, భవనాలు సహా వివిధ అభివృద్ధి పనులతో ప్రజలకు ప్రాథమిక సౌకర్యాలు కల్పించడమే మొదటి లక్ష్యమని ఎమ్మెల్యే జేఎన్ గణేష్ తెలిపారు. తాలుకాలోని హంపిదేవనహళ్లి గ్రామపరిధిలోని జవుకు గ్రామంలో ఉన్నత పాఠశాల సమీపంలోని రోడ్డుపై 2024-25 సంవత్సరానికి రూ. 472.40 లక్షల వ్యయంతో దేవసముద్రం గ్రామంలో ఎల్ఎల్‌సీ కాలువ నుండి జవుకు వరకు రోడ్డు అభివృద్ధికి ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన కింద రూ. 14 లక్షల వ్యయంతో లైబ్రరీ నిర్మాణానికి ఆదివారం ఆయన భూమి పూజ చేశారు. రైతులు రోడ్ల అభివృద్ధి చెందితే వారు పొలాలకు వెళ్లడానికి చాలా సౌకర్యంగా వుంటుందని ఆయన అన్నారు. లైబ్రరీలోని పిల్లలు, యువత పుస్తకాల నుండి విద్యతో పాటు జ్ఞానాన్ని పొందుతారు. ప్రభుత్వాలు ఇచ్చే ప్రతి సదుపాయాలన్నీ ప్రజలు సద్వినియోగపరచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సభ్యులు బసవరాజు, ఎస్డీఎంసీ అధ్యక్షులు పక్కీరప్ప, కౌన్సిలర్ సీఆర్ హనుమంతు, నాయకులు షణ్ముఖప్ప, జవుకు మల్లికార్జున, యంకప్ప, రాజన్నగౌడ్, కుమారస్వామి, వీరేశ, సిద్దప్ప, జడెప్ప, వెంకోబ, వీరేశ, లోకేష్ పాల్గొన్నారు.

మోదీ విజయాలను ఇంటింటికీ తెలియజేయాలి

- కార్యకర్తలకు మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప సూచన

సిరుగుప్ప, జూన్ 15(ఆంధ్రజ్యోతి): దేశ ప్రధాని నరేంద్రమోదీ విజయాలను ఇంటింటికీ తెలియజేయాలని మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప కార్యకర్తలకు సూచించారు. ఆదివారం సిరుగుప్పలోని బీజేపీ కార్యాలయంలో భారత వికసిత కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సోమలింగప్ప మాట్లాడుతూ దేశం కోసం ప్రధాని మోదీ పథకాలను ప్రవేశపెట్టారని, రైతులకు పీఎం కిసాన్ నిధులు జమ, విశ్వకర్మ బ్యాంకు రుణాల పథకాలను ప్రజలకు తెలపాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా బీజేపీ తాలుకా అధ్యక్షులు మల్లికార్జున స్వామి, కార్యదర్శి బసవరాజు, మల్లికార్జున, కార్యకర్తలు పాల్గొన్నారు.

చలవాది సఘం అధ్యక్షుడిగా గణేష్



గణేష్‌ను అభినందిస్తు్న ఎమ్మెల్యే బీఎం నాగరాజు

సిరుగుప్ప, జూన్15(ఆంధ్రజ్యోతి): సిరుగుప్ప తాలుకా చలవాది మహా సమాజం నూతన అధ్యక్షుడిగా గణేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం ఎమ్మెల్యే బీఎం నాగరాజు ఆయనకు గౌరవ సన్మానాన్ని చేశారు. చలవాది మహాసమాజం అభివృద్ధి కోసం కృషి చేయాలని ఆయన సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో చలవాదుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మంజునాథరెడ్డి, ప్రముఖ నాయకులు వెంకటేష్, పవన్‌కుమార్ దేశాయి, చలవాది మహాసభ సభ్యులు పాల్గొన్నారు.

ఇస్కాన్‌లో భాగవత ప్రవచనాలు

దర్మవరం రూరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మా ర్కెట్ యార్డు సమీపం లో ఉన్న ఇస్కాన్ మందిరంలో ఆదివారం ఇస్కాన్ ధర్మవరం ధర్మప్రచారకులు శ్రీకృష్ణ మాధవదాస్ భాగవ త ప్రవచనాలను వివరించారు. ఈ సందర్భంగా మందిరంలో కొలువుదీరిన బలరామ, సుభద్ర, జగన్నాథుడి ప్రతిమలను అందంగా అలంకరించి సంకీర్తనలు చేశారు. అనంతరం భా గవతంలో శ్రీకృష్ణుడి పాత్ర, ప్రవచనాలను భక్తులకు వివరించారు.

హోసూరు జోన్

వ్యక్తి దారుణహత్య - లొంగిపోయిన నిందితుడు



వెంకటేశన్ (ఫైల్)

కృష్ణగిరి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కృష్ణగిరిలో పట్టపగలు ఒక నాటక రచయితను వెంబడించి నరికి చంపిన సంఘటన ప్రజలలో కలకలం రేపింది. ద్విచక్రవాహనంపై వెళ్తున్న 45ఏళ్ల వ్యక్తిని కొడవలితో దాడి చేశాడు. రక్తపుమడుగులో పడియున్న వ్యక్తిని సమీపంలో గస్తీలో ఉన్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని రక్షించే ప్రయత్నం చేశారు. ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే కన్నుమూశాడు. మృతుడిని జేసుపల్లికి చెందిన గ్రామీణ నాటక రచయిత వెంకటేశన్ గా గుర్తించారు. కాగా వెంకటేశన్‌ను చంపిన వ్యక్తి పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు. స్థానికంగా సీసీ టీవీలలో నమోదైన ఫుట్టేజీలను పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

అన్నాడీఎంకేలో చేరిక

హోసూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లా వేపనహళ్ళి శాసనసభ నియోజకవర్గంలోని వేపనహళ్ళి వెస్ట్ యూనియన్ నుంచి ప్రముఖ డీఎంకే వ్యాపారవేత్త నేదుసలై, ఆర్ముగం, మహేశ్ తదితరుల నేతృత్వంలో వందలాదిమంది కార్యకర్తలు అన్నాడీఎంకేలోకి చేరారు. పార్టీ జనరల్ సెక్రటరీ, ఎమ్మెల్యే కేపీ మునుసామి వారిని సాదరంగా ఆహ్వానించారు. ఆదివారం ఏర్పాటైన కార్యక్రమంలో సుమారు 500మంది కార్యకర్తలు అన్నాడీఎంకేలోకి చేరారు. అన్నాడీఎంకే వెస్ట్ యూనియన్ కార్యదర్శి శైలేశ్ కృష్ణన్, కేటీఆర్, మాజీ కౌన్సిలర్ ఎల్లప్పన్, మారసంద్రం చంద్రన్, నారాణికుప్పం అప్పదురై, రాజేంద్రన్ తదితరులు పాల్గొన్నారు.



కార్యకర్తలతో ఎమ్మెల్యే మునుసామి

ఉన్నత వ్యక్తిత్వంతో ఆదర్శంగా నిలవాలి

- రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ సయ్యద్ షా అలి అల్ హుసేని



చైర్మన్‌ను సన్మానిస్తున్న స్థానిక నాయకులు

రాయచూరు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ప్రవర్తనలో ఉన్నత ప్రమాణాలు పాటించి ఉత్తమ వ్యక్తిత్వంతో ఇతరులకు ఆదర్శంగా నిలవాలని కర్ణాటక రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ సయ్యద్ షా అలి అల్ హుసేని సాహెబ్ సూచించారు. మనం సన్మార్గంలో ఉన్నప్పుడే ఇతరులకు బోధనలు చేయగలమని ఆ నిబంధనను ప్రతి ఒక్కరు పాటించాలన్నారు. రాష్ట్ర వక్ఫ్ బోర్డు బాధ్యతలు స్వీకరించిన అనంతరం సయ్యద్ షా అలి తొలి సారి జిల్లా కేంద్రానికి వచ్చారు. శనివారం రాత్రి స్థానిక వాల్కాట్ మైదానంలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసిన మైనార్టీలు వక్ఫ్ బోర్డు చైర్మన్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడిన వక్ఫ్ బోర్డు చైర్మన్, తన పై నమ్మకం ఉంచి అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వహిస్తానన్నారు. ఇతరులకు చెప్పే మాటలు తొలుత మనం ఆచారించాలన్నదే పవిత్ర ఖురాన్ సూక్తి అని దాన్ని ప్రతియొక్కరు పాటించాల్సిన అవసరం ఉందన్నారు. తనకు ఈ అవకాశం కల్పించిన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గె, ముఖ్యమంత్రి సిద్దరామయ్య, డీసీఎం డీకే వివకుమార్‌లకు ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. తన నియామకానికి సహకరించిన మంత్రి ఎన్.ఎస్.బోసరాజు ఎమ్మెల్సీ వసంత్ కుమార్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

సింధనూరుకు సైనిక పాఠశాల మంజూరు..!

రాయచూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని సింధనూరు సమీపం హొసళ్ళి రోడ్డులోని కృష్ణదేవరాయ విద్య సంస్థలో సైనిక స్కూల్‌కు కావల్సిన అన్ని సౌకర్యాలు ఉన్నాయంటు విద్యా సంస్థ తరఫున ఇటీవల కేంద్ర ప్రభుత్వానికి విన్న వించారు. ఈ విషయాన్ని కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమార స్వామి కేంద్రానికి వివరించగా సైనిక స్కూల్‌కు సంబంధించి ఉన్నతాధికారుల బృందం ఇటీవలే సింధనూరులోని కృష్ణదేవరాయ విద్య సంస్థను పరిశీలించి వెళ్లింది. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం సైనిక స్కూల్ నిర్వహణకు అనుమతినిస్తు ఆదేశాలు జారీ చేసింది. దీంతో పాఠశాల పాలక మండలి సభ్యులు ఆదివారం బెంగళూరులో కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమార స్వామిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కాగా జిల్లాకు సైనిక స్కూల్ రావడం పట్ల మాజీ మంత్రి, సింధనూరు మాజీ ఎమ్మెల్యే వెంకటరావ్ నాడగౌడ హర్షం వ్యక్తం చేశారు. కల్యాణ కర్ణాటక ప్రాంతంలో బీదర్‌లో మినహా ఇస్తే రెండవ సైనిక పాఠశాలగా సింధనూరుకు అవకాశం లభించడం హర్శదాయకమన్నారు.

భారత వాయుసేన అధికారిగా

రాయచూరు జిల్లా వాసి..!

- ఎన్‌డీఏ పోస్టులో రెండో వ్యక్తిగా రికార్డు
- జిల్లాకు చెందిన అభిషేక్ ధరణి



రాయచూరు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): భారత వాయుసేనలో ఫ్లయింగ్ అధికారిగా బాధ్యతదలు చేపట్టి రికార్డు సృష్టించాడు. జిల్లాలోని దేవదుర్గ తాలూకా గబ్బూరుకు చెందిన అభిషేక్ ధరణి, తండ్రి చన్నప్ప ఒక ప్రైవేటు వాహనానికి డ్రైవర్‌గా పని చేస్తుండగా బాల్యం నుంచే అత్యంత పట్టుదలతో విద్యాభ్యాసం సాగించిన అభిషేక్, విద్యాజ్యోతి నవోదయలో శిక్షణ పొంది అంచెలంచెలుగా ఎదిగారు. కాగా జిల్లా నుంచి ఎన్‌డీఏ పోస్టులకు వెళ్లిన రెండవ వ్యక్తిగా అభిషేక్ ధరణి రాకార్డు దక్కించుకున్నారు. ఇంతకు పూర్వం జిల్లాలోని దేవదుర్గ తాలూకా అరకెరాకు చెందిన వెంకటేష్ నాయక్ కర్నల్‌గా భారతవాయుసేనలో సేవలందించి ఇటీవలే రిటైర్డ్ అయ్యారు. అభిషేక్ ధరణి త్వరలోనే స్వంత గ్రామానికి రానున్నట్లు స్థానికులు తెలిపారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

స్టాన్ లారెల్ (జయంతి)



క్లాజికల్ హాలీవుడ్‌లో తమదైన గుర్తింపుతో ప్రపంచవ్యాప్తంగా పేరొందిన లారెల్ అండ్ హార్డి ద్వయంలో ఒకరైన స్టాన్ లారెల్ 1890 జూన్ 16న ఇంగ్లండ్‌లోని ల్యాంకషైర్‌లో జన్మించారు. నటుడిగా 50 సినిమాలకుపైగా నటించారు. అమెరికన్ ఒలివర్ హార్డితో కలసి ఒక జట్టుగా ఏర్పడి 1927 నుంచి 107 సినిమాలు, 32 షార్ట్ మూకీలు, 40 షార్ట్ టాకీలు, 23 పూర్తి నిడివి కలిగిన ఫీచర్ సినిమాలలో నటించారు. బుల్లితెరపైనా తమ సత్తా చాటుకున్నారు. 8ఎంఎం, 16 ఎంఎం హోం మూవీస్, తదితరాలలో రాణించారు. 1965 ఫిబ్రవరి 23న కన్నుమూశారు.

ఆచంట జానకిరాం (జయంతి)



రేడియో ప్రయోక్తగా, రచయితగా, చిత్రకారులుగా బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన ఆచంట జానకిరాం 1903 జూన్ 16న జన్మించారు. విశ్వగురు రవీంద్రనాథ్ ఠాగూర్, అనిబిసెంట్‌లను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగారు. ఆలిండియా రేడియోలో ప్రసార ప్రముఖులుగా పనిచేశారు. మదరాసు నుంచి తొలి తెలుగు నాటకం 'అనార్కలి' జానకిరాం ప్రయోక్తగా వెలువడింది. అంతేకాక రచయిత, చిత్రకారులుగా కూడా రాణించారు. వాణి పత్రిక సహాయ సంపాదకులుగా పనిచేశారు. 1994లో కన్నుమూశారు.

మల్లాది రామకృష్ణశాస్త్రి (జయంతి)



తెలుగు సినీరంగంలో 'ఘోస్ట్ రైటర్' గా పేరొందిన తెలుగు రచయిత మల్లాది రామకృష్ణశాస్త్రి 1905 జూన్ 16న కృష్ణాజిల్లా చిట్టిగూడూరు గ్రామంలో జన్మించారు. కృష్ణా పత్రికలో ఛందోబద్ధమైన కవిత్వం రాశారు. 'చలువ మిరియాలు' పేరిట ఆయన రాసిన వ్యంగ్య వ్యాసాలకు పాఠకుల ఆదరణ లభించింది. 19వ యేటనే కథారచన ప్రారంభించి సుమారు 125 కథలు రాశారు. డుమువులు కథ 14 భారతీయ భాషలలోకి అనువదించబడింది. 'కృష్ణాతీరం' నవల తెలుగుసాహిత్య చరిత్రలో తనదైన గుర్తింపు పొందింది. 1965 సెప్టెంబరు 2న కన్నుమూశారు.

హేమంత్‌కుమార్ (జయంతి)



ప్రముఖ బెంగాలీ గాయకుడు, సంగీత దర్శకుడు హేమంత ముఖోపాధ్యాయ 1920 జూన్ 16న వారణాసిలో జన్మించారు. హేమంత్ కుమార్‌గా పేరొందారు. మరాఠీ, గుజరాతీ, ఒడియా, అస్సామీస్, తమిళ్, పంజాబీ, భోజ్‌పురి, కొంకణి, సంస్కృతం, ఉర్దూ తదితర భాషలలో పాటలు పాడారు. సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత. 'పద్మ భూషణ్'కు నామినేట్ చేయగా సున్నితంగా తిరస్కరించారు. ఉత్తమ నేపథ్యగాయకుడిగా రెండు జాతీయ అవార్డులు, ఉత్తమ సంగీత దర్శకుడిగా పలు అవార్డులు పొందారు. 1989 సెప్టెంబరు 26న కన్నుమూశారు.

ఆచార్య ప్రఫుల్ల చంద్రరాయ్ (వర్ధంతి)



రసాయనశాస్త్ర పితామహగా పరిగణించబడిన ఆచార్య, 'సర్' ప్రఫుల్ల చంద్రరాయ్ 1861 ఆగస్టు 2న జన్మించారు. బెంగాలీకి చెందిన రసాయనవేత్త, విద్యావేత్త, చరిత్రకారుడు, పారిశ్రామికవేత్త, మానవతావాది. దేశపు తొలి ఔషధ సంస్థ బెంగాల్ కెమికల్స్ అండ్ ఫార్మాస్యూటికల్స్ స్థాపించారు. సైన్సుపై పలు రచనలు, పుస్తకాలు రాశారు. రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీచే గుర్తింపు పొందారు. 1944 జూన్ 16న కన్నుమూశారు.

కమలా నారాయణ్ (పుట్టినరోజు)




'పద్మభూషణ్' గ్రహీత కమలా లక్ష్మి నారాయణ్ 1934 జూన్ 16న జన్మించారు. భరతనాట్య కళాకారిణిగా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందారు. చెన్నైలోని మ్యూజిక్ అకాడమీ నిర్వహించిన కార్యక్రమంలో పిన్న వయస్కురాలిగా సత్తా చాటుకున్నారు. 1940-70ల మధ్య దేశవ్యాప్తంగా పలు నృత్య ప్రదర్శనలు ఇచ్చి జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు అందుకున్నారు. నాట్యపద్మాన్, కర్ణాటిక్ మ్యూజిక్ అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికాచే జీవిత సాఫల్య పురస్కారం, ఇతర అవార్డులు పొందారు.

సంతోష్‌హెగ్డే (పుట్టినరోజు)



జస్టిస్ నిట్టె సంతోష్‌హెగ్డే 1940 జూన్ 16న ఉడుపి జిల్లా గ్రామంలో జన్మించారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి, సొలిసిటర్ జనరల్ ఆఫ్ ఇండియా వంటి కీలక హోదాలలో కొనసాగారు. 2005లో సుప్రీంకోర్టు జస్టిస్‌గా రిటైరయ్యాక కర్ణాటక లోకాయుక్తగా 2006 నుంచి 2011వరకు కొనసాగారు. అవినీతిపరుల గుండెల్లో సింహస్వప్నంగా నిలిచారు. మంగళూరువర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు.

రాబిన్ శర్మ (పుట్టినరోజు)



కెనడియన్ రచయిత, ప్రసంగీకుడు రాబిన్ శర్మ 1964 జూన్ 16న జన్మించారు. ప్రపంచంలోని టాప్ 5 లీడర్‌షిప్ ఎక్స్‌పర్ట్‌లలో ఒకరిగా నిలిచారు. ప్రంచంలో పేరొందిన మైక్రోసాఫ్ట్, ఫెడెక్స్, నైక్, జీఈ, హెచ్‌పీ, ఒరాకిల్ నుంచి నాసా, యేల్ యూనివర్శిటీ తదితర సంస్థలు ముఖ్య కార్యక్రమాలకు ఆయననే ఎంచుకుంటాయి. 'ది లీడర్ హు హ్యాడ్ నో టైటిల్' అనే పుస్తకం ఎంతో పేరొందింది. 75దేశాలకుపైగా 1.5కోట్లకుపైగా పుస్తకాలు అమ్ముడయ్యాయి.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

హిందూపురం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): హిందూపురం రైల్వే స్టేషన్ సమీపంలో ట్రాక్‌పై అపస్మారక స్థితిలో పడి ఉన్న గుర్తుతెలియని వ్యక్తి(48)ని రైల్వే పోలీసులు ఆదివారం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఆధారాలను బట్టి మడకశిర ప్రాంతమని పోలీసులు అనుమానిస్తున్నారు.

కావేరి నీరు ఇవ్వండి

» ఎమ్మెల్యే ధీరజ్ మునిరాజ్



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే ధీరజ్

దొడ్డబళ్లాపుర, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): దొడ్డబళ్లాపుర తాలూకాకు ఎత్తినహొళె, కావేరి నీరు కాకుండా బెంగళూరులో శుద్ధీకరించిన వృషభావతి నీరు వద్దని ఎమ్మెల్యే ధీరజ్ మునిరాజ్ అభిప్రాయపడ్డారు. వృషభావతి నీరు నీరావరి పథకాలకు వ్యతిరేకమని, అంశంపై తాలూకాలోని అన్ని గ్రామపంచాయతీలు 15రోజుల్లోగా నిర్ణయం తీసుకోవాలన్నారు. పట్టణంలోని డాక్టర్ బాబు జగ్జీవన్‌రాం భవన్‌లో గ్రామపంచాయతీ, నగరసభలకు చెందిన ప్రజాప్రతినిధుల, వివిధ సంఘాల ప్రముఖులు, ప్రజలతో సమాలోచన సభలో పాల్గొని మాట్లాడారు. స్థానిక రైతులకు వ్యతిరేకంగా ఇటీవలే నెలమంగల తాలూకాలోని చెరువులకు వృషభావతి నీటిని ప్రవహించే పథకం పనులకు ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ భూమిపూజ చేశారన్నారు. దొడ్డబళ్లాపుర తాలూకాలోని మధురె, అమరకుమల్లిగె చెరువులకు బెంగళూరులో ప్రవహించే వృషభావతి నీటిని శుద్ధీకరించి పారించేలా డీపీఆర్‌ను సిద్ధం చేశారన్నారు. అన్ని గ్రామపంచాయతీలలో వృషభావతి నీటిని తాలూకా చెరువులకు పారించే పథకాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్ర శాసనసభ వర్షాకాల సమావేశాలలో ప్రభుత్వదృష్టికి తీసుకొస్తానన్నారు.

ఎత్తిపోతల పథకంలో తాలూకాలోని సాసలు హోబళి 7 చెరువులకు మాత్రం నీటిని నింపే పథకం ఇదే. చిన్ననీటి పారుదలశాఖ పరిధిలోని తాలూకాలోని 28 చెరువులకు ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని నింపదలిచారు. పట్టణంలోని బాశెట్టిహళ్ళి పారిశ్రామికవాడకు కావేరి నీటిని అందించేలా కావేరి నీటిపైప్‌లైన్ అమర్చారన్నారు. ఈ పైప్‌లైన్ ద్వారా నగరసభ పరిధిలోని, పారిశ్రామికవాడలోని దొడ్డతుమకూరు, మజరా హొసహళ్ళి గ్రామపంచాయతీలోని గ్రామాలకు కావేరి నీటిని సరఫరా చేయాల్సి ఉందన్నారు. ఈ అంశంపై తాలూకాలోని అఖిలపక్ష సమావేశం రాష్ట్ర నీటివనరులశాఖ మంత్రి, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో కలసి విన్నవించదలిచామన్నారు. తాలూకాలోని పలు అంశాలపై సమావేశంలో చర్చించారు. నగరసభ స్థాయి సమితి అధ్యక్షుడు వీఎస్ రవికుమార్, బీజేపీ తాలూకా అధ్యక్షుడు నాగేశ్, ప్రముఖుడు కేఎం హనుమంతరాయప్ప, రంగరాజు, వత్సలా తదితరులు పాల్గొన్నారు.

చాముండేశ్వరీదేవి దర్శనానికి రూ.2 వేల టిక్కెట్

» బీజేపీ సహా ప్రజాసంఘాల ఆగ్రహం

బెంగళూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసంలో చాముండేశ్వరీదేవి దర్శనం కోసం కర్ణాటకతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వస్తుంటారు. ప్రత్యేకించి మంగళ, శుక్ర, ఆదివారాలలో పెద్దఎత్తున భక్తులు పూజలు చేసే సంప్రదాయం దశాబ్దాలుగా సాగుతోంది. ఈనెల 27వ తేదీ నుంచి ఆషాఢమాసం ప్రారంభం కానుంది. ఆషాఢమాసం తొలిరోజు శుక్రవారం రావడంతో పెద్దఎత్తున భక్తులు వస్తుంటారు. ప్రత్యేకించి ఆషాఢ శుక్రవారం చాముండేశ్వరీ దేవిని ప్రత్యేకంగా దర్శించుకునేందుకు రెండువేల రూపాయల టిక్కెట్‌గా ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వ దేవదాయశాఖ తీసుకున్న నిర్ణయంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. సీఎం సిద్ధ రామయ్య, సాంఘిక సంక్షేమశాఖా మంత్రి మహ దేవప్పల నిర్ణయంతోనే అత్యంత అధికంగా ప్రత్యేక దర్శనం టిక్కెట్ విధించారని బీజేపీ అధికార ప్రతినిధి ఎంజీ మహేష్ ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం హిందూ భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారన్నారు. ప్రత్యేక దర్శనంకు ఎక్కడైనా రెండువేల టికెట్ ఏర్పాటు చేస్తారా అంటూ మండిపడ్డారు. మైసూరు జిల్లా కు చెందిన ముఖ్యమంత్రి స్థానిక భక్తులపై ఈ విధంగా భారం మోపడం సరికాదన్నారు. దసరా నిర్వహణకు ఏకంగా రూ.41.70 కోట్లు ఖర్చు చేశామని ప్రభుత్వం ప్రకటించిందని వాటి లెక్కలు ప్రకటించేందుకు ఏకంగా పదినెలలు తీసుకున్నారన్నారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మతాల వారిగా భేదాభిప్రాయం చూపుతోంద న్నారు. దక్షిణకన్నడ జిల్లా బంట్వాళలో ఉరుసు నిర్వహణకు ఏకంగా నాలుగు కోట్లు కేటాయించి మైనార్టీల పక్షపాతిగా వ్యవహరిస్తోందని కానీ హిందువుల ఆలయాల నుంచి మాత్రం భారీ ఆదాయం కోసం ఆశిస్తోందన్నారు. గ్యారెంటీలతో దివాలా తీసిన ప్రభుత్వం ప్రజల నుంచి ఆలయాల టికెట్‌ల రూపంలో కూడా ఆదాయం గడించాలని భావిస్తోందన్నారు. టిక్కెట్ ధర పెంచడాన్ని మైసూరుకు చెందిన ప్రజాసంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

8 నుంచి గురుపూజోత్సవం



ఆహ్వానపత్రిక ఆవిష్కరణలో ధర్మాధికారి డాక్టర్ ఎంఆర్ జయరాం

చింతామణి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కైవార సద్గురు యోగినారేయణ తాతయ్యమఠంలో గురుపూర్ణిమను పురస్కరించుకుని జులై 8 నుంచి మూడు రోజులపాటు గురుపూజా మహోత్సవం జరగనుందని కైవార క్షేత్ర ధర్మాధికారి డాక్టర్ ఎంఆర్ జయరాం తెలిపారు. మఠంలో ఆదివారం ఉత్సవాల ఆహ్వానపత్రికను ఆవిష్కరించి మాట్లాడారు. 72 గంటలపాటు గురుపూజా సంగీతోత్సవం ఉంటుందని, జాతీయ, రాష్ట్ర స్థాయి కళాకారులు పాల్గొంటారన్నారు. నాదసుధారస సంకీర్తనా యోజనె సంచాలకులు వానరాశి బాలకృష్ణ భాగవతార్ మాట్లాడుతూ జులై 8న ఉదయం 6 గంటలకు ధర్మాధికారి జయరాం నేతృత్వంలో సామూహిక నామ సంకీర్తనతో సంగీతోత్సవాన్ని ప్రారంభిస్తారన్నారు. మూడురోజులపాటు కోలారు, చిక్కబళ్ళాపుర జిల్లాలతోపాటు రాష్ట్ర, జాతీయస్థాయి కళాకారులు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో సత్యనారాయణ్, నరసింహప్ప, తిప్పేస్వామి, కైవారమఠం మేనేజర్ లక్ష్మీనారాయణ్ తదితరులు పాల్గొన్నారు.

తొక్కిసలాట నిర్లక్ష్యంపై రేపు నిరసన

» బీజేపీ నేతలు



పోస్టర్లను ప్రదర్శిస్తున్న బీజేపీ నాయకులు

బెంగళూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): చిన్నస్వామి స్టేడియం వద్ద తొక్కిసలాటలో 11మంది మృతికి నిర్లక్ష్యంపై సీఎం, డీసీఎంలు రాజీనామా చేయాలని ఈనెల 17న మంగళవారం భారీ నిరసన చేపడుతున్నట్లు మాజీ మంత్రి గోపాలయ్య తెలిపారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం నిరసనకు సంబంధించి పోస్టర్లను విడుదల చేసి ఆయన మాట్లాడారు. తొక్కిసలాటతో రాష్ట్రానికి చెడ్డపేరు తెచ్చారన్నారు. ప్రమాదానికి కారణం ప్రభుత్వ నిర్లక్ష్యం, గంటలలోనే సభలు జరపాలనే ఆతుత కారణమన్నారు. మంగళవారం రాత్రి మ్యాచ్ గెలుపొందాక రాత్రంతా సంబరాలు జరిగాయని, పోలీసులు విధులు నిర్వహించారన్నారు. ఈలోగానే ఉదయం అప్పటికప్పుడే సభలు జరపడంతోనే ప్రమాదం జరిగిందన్నారు. మరోవైపు కులగణనకు 167 కోట్ల రూపాయల ప్రభుత్వధనం వృథా చేశారన్నారు. ప్రజలకు బాధ్యతగా వ్యవహరించకుండా వృథా చేస్తున్న ప్రభుత్వానికి బుద్ధి చెబుదామన్నారు. 11మంది కుటుంబాలకు న్యాయం చేయాలని దొడ్డబళ్ళాపుర ఎమ్మెల్యే ధీరజ్ మునిరాజ్ డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ రవికుమార్, జిల్లా అధ్యక్షుడు సప్తగిరిగౌడ, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

53 యూనిట్ల రక్తం సేకరణ



రక్తదాతలకు ప్రశంసాపత్రం అందజేత

శిడ్లఘట్ట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): అఖిల కర్ణాటక చిరంజీవి యువత, అఖిల కర్ణాటక పవర్‌స్టార్ పవన్‌కల్యాణ్ అభిమానుల సేవాసంఘం శిడ్లఘట్ట విభాగం, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో పట్టణంలోని అశోక రోడ్డులోని వేణుగోపాలస్వామి దేవాలయం ఆవరణలో బృహత్ రక్తదాన శిబిరం నిర్వహించారు. చుట్టుపక్కల ప్రాంతాలనుంచి అభిమానులు, యువకులు వచ్చి రక్తదానం చేయగా 53యూనిట్లకుపైగా రక్తాన్ని సేకరించారు. రక్తదానంతో ఎంతోమంది రోగుల ప్రాణాలు కాపాడవచ్చునని వక్తలు పేర్కొన్నారు. సంఘం జాతీయ అధ్యక్షుడు సత్యనారాయణ మహేశ్ మాట్లాడుతూ నటులు మెగాస్టార్ చిరంజీవి, పవన్‌కల్యాణ్ సమాజసేవయే తమకు స్ఫూర్తిదాయకమన్నారు. ఇటువంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తామన్నారు. చిరంజీవి అభిమానుల నేతృత్వంలో శిడ్లఘట్ట సహా దేశ వ్యాప్తంగా 73కుపైగా రక్తదాన శిబిరాలు నిర్వహించినట్టు తెలిపారు. హీరోల పుట్టినరోజులు, ప్రపంచ రక్తదాతల దినోత్సవం వంటి సందర్భాలలో యువత రక్తదానం చేస్తున్నారన్నారు. ఇదే సందర్భంగా రక్తదాతలకు ప్రశంసాపత్రం అందచేసి అభినందించారు. కార్యక్రమంలో అఖిల కర్ణాటక చిరంజీవి యువత తాలూకా అధ్యక్షుడు నారాయణస్వామి, రాష్ట్ర జాయింట్ కార్యదర్శి దినేశ్‌బాబు, పవన్‌కల్యాణ్ అభిమానుల సేవాసంఘం జిల్లా అధ్యక్షుడు బుజ్జినాయక్, జిల్లా సభ్యుడు రాధాకృష్ణ, తాలూకా ప్రధాన కార్యదర్శి రామదాస్, గజేంద్రనాయక్, వెంకటరమణ, వెంకటరెడ్డి, రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

భారీ అంబేడ్కర్ విగ్రహానికి సీఎం సానుకూలం



సంఘం జిల్లా అధ్యక్షుడు శివానందతో మురుగేశ్ తదితరులు

బంగారుపేట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): స్వాభిమాన ప్రతీక, విశ్వానికి సమానత సందేశం అందించిన డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ భారీ విగ్రహాన్ని రాష్ట్రంలో ఏర్పాటు చేసేందుకు సీఎం సిద్దరామయ్య సానుకూలం చేశారని భీమ ప్రజాసంఘాల పోరాటానికి దక్కిన విజయమని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వైట్‌ఫీల్డ్ మురుగేశ్ అభిప్రాయపడ్డారు. పట్టణంలోని అంబేడ్కర్ భవనంలో ఆదివారం ఏర్పాటైన భీమ ప్రజాసంఘాల నూతన జిల్లా అధ్యక్షుల ఎంపిక కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్రానికి చెందిన నేల, జల, భాష, తారతమ్య ధోరణి, మౌలిక హక్కుల రక్షణ, పేద దళిత రైతుల భవిష్యత్తును రూపొందించే పోరాటాలలో సంఘం నిరంతరంగా ఉందన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు మునిరాజు గడువు ముగియడంతో కొత్త అధ్యక్షుడి ఎంపిక ప్రక్రియ జరిగిందన్నారు. సభ్యులందరి ఆమోదంతో కెంతపురకు చెందిన శివానందను నూతన జిల్లాఅధ్యక్షుడిగా ఎంపిక చేసినట్టు తెలిపారు. కాగా అంబేడ్కర్ సుమారు వందల అడుగుల ఎత్తైన విగ్రహాన్ని నిర్మించే హామీ ఇచ్చారన్నారు. ఇది సంఘాల పోరాటానికి దక్కిన విజయమన్నారు. శివానంద మాట్లాడుతూ తాజా మాజీ అధ్యక్షుడు మునిరాజు మార్గ దర్శకత్వంలో న్యాయపరమైన పోరాటాలు కొనసాగిస్తామన్నారు. సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు నక్కనహళ్ళి మునిరాజు, బంగారపేట తాలూకా మహిళా సంఘం అధ్యక్షురాలు నాగరత్న తదితరులు పాల్గొన్నారు.

బస్సు ఆపలేదని.. డ్రైవర్‌ను చెప్పుతో కొట్టిన టెక్కీ అరెస్టు

బెంగళూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): అడిగిన చోటున బస్సు ఆపలేదనే ఆరంభమైన వాగ్వాదం తీవ్ర స్థాయికి చేరి ఏకంగా బస్సు డ్రైవర్‌ను సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ (టెక్కీ) కావ్య చెప్పుతో కొట్టిన సంఘటనచోటు చేసుకుంది. ఈనెల 11 టిన్ ఫ్యాక్టరీ నుంచి విప్రోగేట్ మీదుగా ఎలక్ట్రానిక్ సిటీ వైపు వెళ్ళే బీఎంటీసీ బస్సుకు అత్తర్ హుసేన్ డ్రైవర్‌గా ఉన్నారు. ఉదయం 8.30గంటల వేళ కైగొండనహళ్ళి బస్టాప్‌లో టెక్కీ కావ్య బస్సు ఎక్కారు. మార్గమధ్యంలో వచ్చే ఆఫీసు వద్ద బస్సు ఆపాలని ఆమె కోరారు. బస్సు ఫుల్‌గా ఉందని బస్టాప్ కాకుండా మధ్యలో ఆపలేనన్నారు. ఇరువురి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఉదయం, సాయంత్రం వేళల్లో ఎక్కడపడితే అక్కడ ఆపడం సాధ్యం కాదని డ్రైవర్ చెబుతున్నారు. అంతలోనే ఇరువురి మధ్య మరింత మాటలు పెరిగాయి. అంతలోనే కావ్య ఒక్కసారిగా అబ్బో కడుపునొప్పి అంటూ కేకలు పెట్టారు. దీంతో డ్రైవర్ ఒక్కసారిగా బస్సును పక్కకు తీసుకెళ్ళి ఆపేశారు. దీంతో ఇప్పుడు బస్సును ఎలా ఆపావంటూ గొడవకు దిగిన కావ్య తీరును డ్రైవర్ తప్పుబట్టారు. అంతలోనే ఒక్కసారిగా చెప్పు తీసి డ్రైవర్‌ను కొట్టేశారు. దీంతో బస్సు డ్రైవర్ నేరుగా బెళ్ళందూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బస్సులోని సీసీ కెమెరాల పుటేజీల ఆధారంగా కావ్య చెప్పుతో కొట్టినట్లు నిర్ధారించుకుని కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

ఎమ్మెల్యేలకు గ్రాంట్లు కేటాయించాలి..



ఇందిరా క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సమృద్ధి మంజునాథ్


ముళబాగిలు, జూన్15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం కాంగ్రెస్సేతర ఎమ్మెల్యేలకు గ్రాంట్లు కేటాయించడంలో తారతమ్యం చూపుతోందని, ఈ అంశంపై కోర్టును ఆశ్రయించనున్నట్టు ఎమ్మెల్యే సమృద్ధి మంజునాథ్ తెలిపారు. పట్టణంలోని ఇందిరాక్యాంటీన్‌ను ఆదివారం లాంఛనంగా ప్రారంభించి మాట్లాడారు. 224 ఎమ్మెల్యేలు ఓటర్లద్వారా ఎన్నికయ్యారని, నియోజకవర్గాల సమగ్ర అభివృద్ధికి సమానంగా గ్రాంట్లు విడుదల చేయాలని కోరారు. కాగా ఆకలిరహిత కర్ణాటక కోసం కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఇందిరా క్యాంటీన్‌లను ఏర్పాటు చేసిందన్నారు. తాజాగా ముళబాగిలుకు కేటాయించడంపై హర్షం వ్యక్తం చేశారు. క్యాంటీన్‌లో ఉదయం రూ.5కు అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి రూ.10కి రాయితీతో భోజనం ఉంటుందన్నారు. కార్యక్రమంలో యోజనా డైరెక్టర్ అంబికా, తాలూకా జేడీఎస్ అధ్యక్షుడు కాడేనహళ్ళి నాగరాజ్, కార్యదర్శి రఘుపతి రెడ్డి, కాంగ్రెస్ పట్టణ విభాగం అధ్యక్షుడు అమానుల్లా, నగరసభ కమిషనర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

తొక్కిసలాట నియంత్రణకు కొత్తచట్టం

» త్వరలోనే అమలుకు సర్కారు కసరత్తు

బెంగళూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): చిన్నస్వామి స్టేడియం వద్ద ఆర్సీబీ విజయోత్సవాల వేళ తొక్కిసలాటలో 11మంది మృతి చెందిన నేపథ్యంలో రాష్ట్రప్రభుత్వం తొక్కిసలాట వంటి సంఘటనల నియంత్రణకు కొత్తచట్టాన్ని తీసుకురాదలిచింది. రద్దీని నిభాయించడంతోపాటు పలు విధానాలు పాటించదలిచింది. ఇప్పటికే రెండు బిల్లులు కూడా సిద్ధం చేసినట్టు తెలుస్తోంది. ధార్మిక, జాతర, రథోత్సవాలు, పల్లకీ ఉత్సవాలు, తేరు, ఉరుసు వంటి కార్యక్రమాలను మినహాయింపు ఇవ్వనున్నారు. రాజకీయ ర్యాలీలు, జాథా, సమావేశాలతోపాటు సామూహిక సభలు, ప్రాయోజిత కార్యక్రమాలకు అన్వయింపచేయనున్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే మూడేళ్ల జైలుశిక్ష, రూ.5లక్షల దాకా జరిమానా విధించదలిచారు. కార్యక్రమం నిర్వహించేందుకు స్థలం ఇచ్చినవారిపైనా చర్యలు తీసుకోదలిచారు. అసంఘటితంగా జనం చేరే సమయంలో మాత్రమే నియంత్రించేందుకు ఈ ప్రయోగం చేయదలిచారు. క్రీడలు, సర్కస్ లాంటి వాణిజ్య ఉద్దేశ్య కార్యక్రమాలు ఏర్పాటు చేయకముందే జనాన్ని ఏ విధంగా నియంత్రిస్తారు అనేది వివరించాల్సి ఉంటుంది. ఎటువంటి కార్యక్రమమైనా పోలీసుల అనుమతి లేకుండా నిర్వహించేందుకు వీలుండదు. ప్రత్యక్ష, పరోక్షంగా తొక్కిసలాట వంటి సంఘటనలు కొనసాగితే నేరంగా భావిస్తారు. ప్రతి సభకు సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో అనుమతులు పొందాల్సి ఉంటుంది. ఇంకా చట్టం దిశగా అమలుకాకున్నా శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి హెచ్‌కే పాటిల్ సూత్రప్రాయంగా వివరించారు.

భక్తిశ్రద్ధలతో సంకష్ట చతుర్థి



ద్విముఖ గణపతి

శిడ్లఘట్ట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): సంకష్టచతుర్థి నేపథ్యంలో పట్టణంలోని అశోకరోడ్డులో కొలువైన ద్విముఖ గణపతి ఆలయంలో శనివారం సాయంత్రం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేకువజామున ఆలయశుద్ధి, అనంతరం స్వామివారికి విశేషపూజలు నిర్వహించారు. ఆలయాన్ని గరికతో, పుష్పాలతో అలంకరించారు. సాయంత్రం స్వామివారికి అలంకరణ, నైవేద్యాలు సమర్పించారు. ఇదే సందర్భంగా సంకష్టచతుర్థి చరిత్రను వివరించారు. 8.30 గంటలకు మహామంగళారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ, అన్నసంతర్పణ నిర్వహించారు.

సిద్దగంగ మఠం ప్రాంగణంలో

బౌన్సర్లున్న కారు ఢీ - మహిళకు గాయాలు

బెంగళూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): తుమకూరు సిద్ధగంగామఠాన్ని ఎక్కా సినిమా బృందం ఆదివారం సందర్శించింది. తిరుగు ప్రయాణంలో బౌన్సర్‌లు ఉన్న కారు ఓ మహిళను ఢీ కొనగా తీవ్ర గాయాలపాలయ్యారు. నటుడు యువరాజ్‌కుమార్‌తోపాటు బృందం మఠాన్ని సందర్శించారు. ఇదే సమయంలో బళ్ళారికి చెందిన లింగమ్మ, కుమారుడిని పాఠశాలలో వదిలి వాపసు వెళ్తున్నారు. వేగంగా దూసుకొచ్చిన కారు ఆమెను ఢీ కొంది. కాలికి తీవ్ర గాయాలయ్యాయి. ఆసుపత్రికి తీసుకెళ్లాలని ఆమె వేడుకుంటున్నా పట్టించుకోకుండా కారు వెళ్లిపోయింది. అనంతరం స్థానికులు ఆమెను ఆసుపత్రికి తరలించారు.

కాంతార 1 షూటింగ్‌లో బోల్తాపడ్డ బోటు

కాంతార 1 సినిమా షూటింగ్ వేళ బోటు బోల్తాపడింది. సుమారు 30మంది నీటిలో పడి ఎట్టకేలకు ఒడ్డుకు చేరుకున్నారు. శివమొగ్గ జిల్లా మాస్తి ప్రదేశంలోని మాని జలాశయంలో షూటింగ్ జరుగుతుండగా ప్రమాదం చోటు చేసుకుంది. కొప్పగా పిలిచే ఈ ప్రాంతంలో బోటులో వెళ్తూ షూటింగ్ చేస్తున్నారు. ఒక్కసారిగా బోటు ఓవైపు నీట మునిగి పూర్తిగా బోల్తా పడింది. శివమొగ్గ పోలీసుల సమాచారం మేరకు అందరూ బయటపడ్డారన్నారు. సమగ్ర దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. కాంతార ఫేం రిషబ్‌శెట్టి కూడా బోటులో ఉన్నట్టు తెలుస్తోంది. శనివారం సాయంత్రం ప్రమాదం జరిగింది. కాగా ఈనెల 13న తీర్థహళ్ళి పరిధిలోని ఆగుంబె హోంస్టేలో ఉన్న నటుడు విజ్జు వీకే గుండెపోటుతో కన్నుమూశారు. కేరళ రాష్ట్రం త్రిచూర్‌కు చెందిన విజ్జుకు 50ఏళ్లు.

వీధివ్యాపారులకు లైసెన్సు పత్రాల అందజేత



లైసెన్సుపత్రాలను అందజేస్తున్న ఆదిల్‌బాషా

బొమ్మనహళ్ళి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): బొమ్మనహళ్ళి నియోజకవర్గ పరిధిలోని వీధి వ్యాపారులకు స్థానిక మానవహక్కుల సమాఖ్య బొమ్మనహళ్ళిశాఖ అధ్యక్షుడు ఆదిల్‌బాషా ఆధ్వర్యంలో వీధి వ్యాపారులకు లైసెన్సుపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆదిల్ మాట్లాడుతూ కొన్నినెలలుగా వీధివ్యాపారులు సైతం తప్పనిసరిగా లైసెన్సు కల్గి ఉండాలని బీబీఎంపీ అధికారులు షరతులు విధించారన్నారు. సంవత్సరాల తరబడి వీధివ్యాపారాలు చేస్తున్నవారిని ఎంపిక చేసి వారి వివరాలను కార్యాలయం సమర్పించి లైసెన్సులు పొందినట్టు తెలిపారు. సంఘం ఆధ్వర్యంలో వీధివ్యాపారుల సంక్షేమం కోసం ఎన్నో పోరాటాలు చేస్తున్నామన్నారు. వారికోసం ఒక నిర్దిష్టమైన స్థలాన్ని కేటాయించాలని బొమ్మనహళ్ళి కమిషనర్‌కు, బీబీఎంపీ ప్రధాన కార్యాలయానికి పలుమార్లు విన్నవించామన్నారు. బొమ్మనహళ్ళి వార్డులో తగిన ప్రదేశం లేకపోవడంతో కోడిచిక్కనహళ్ళి రోడ్డుకు ఓవైపున వ్యాపారం చేసుకునేవిధంగా వీలు కల్పించామన్నారు. ట్రాఫిక్‌కు ఇబ్బందిలేకుండా వ్యాపారాలు చేసుకోవాలలన్నారు. విడతల వారీగా వీధివ్యాపారులకు లైసెన్సుల సదుపాయం కల్పిస్తా మన్నారు. వ్యాపారస్తులు ఉషా, మురుగేశ్, రామచంద్ర, బాషా పాల్గొని ఆదిల్‌బాషాను ఆత్మీయంగా సత్కరించారు.